# సొంతింటి కల సాకారమయ్యేనా?

- పైలట్ గ్రామంలో పత్తాలేని ఇందిరమ్మ ఇండ్ల ప్రగతి
- మండల పరిషత్‌లో నత్తనడకన నమూనా ఇల్లు
- ఆందోళనలో లబ్ధిదారులు



మండల పరిషత్ ఆవరణలో పునాదులకే పరిమితమైన ఇందిరమ్మ నమూనా ఇల్లు

గంభీరావుపేట, ఏప్రిల్ 29: గ్రామీణ ప్రాంతాల్లోని పేదల సొంతింటి కలను సాకారం చేయాలన్న ఉద్దేశంతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి కాంగ్రెస్ సర్కారు శ్రీకారంచుట్టింది. రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పథకానికి ఆదిలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఇండ్ల నిర్మాణం ఆచరణలో ఆలస్యం అవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. మండలంలో దమ్మన్నపేటను పైలట్ గ్రామంగా ఎంపిక చేసి, 145మందికి ప్రొసీడింగ్ పత్రాలు అందించారు. అందులో 38ఇండ్ల నిర్మాణాలకు ముగ్గు పోయగా, మూడు ఇండ్లు మాత్రమే బేస్‌మెంట్ స్థాయి, ఐదు ఇండ్లకు పునాదులు తీశారు. మండల పరిషత్ ఆవరణలో నిర్మిస్తున్న మోడల్ హౌస్ సైతం బేస్‌మెంట్ స్థాయిలో పనులు నిలిచిపోయి ముందుకు సాగడం లేదు.

## నత్తనడకన నమూనా ఇల్లు

మండల కేంద్రంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ నమూనా ఇల్లు నిర్మాణానికి హౌసింగ్‌శాఖ ఆధ్వర్యంలో అధికారులు గతంలో ముగ్గు పోశారు. పనులు ప్రారంభించి నెలలు గడుస్తున్నా.. నిర్మాణ పనులు ముందుకు సాగడంలేదు. అందరికీ ఆదర్శంగా మండల కేంద్రంలో నిర్మాణం చేస్తున్న మోడల్ ఇళ్లు పనులు సైతం బేస్‌మెంట్ స్థాయిలో నిలిచిపోయాయి. దమ్మన్నపేటలో 145 ఇండ్ల నిర్మాణం చేయాలని ప్రభుత్వం భావించింది. మంజూరైన ఇండ్లలో ఐదు శాతం లబ్ధిదారులు కూడా పనులు వేగవంతం చేయకపోవడంతో పథకంపై అనాసక్తి చూపిస్తున్నట్లుంది. ఇండ్ల నిర్మాణంలో దమ్మన్నపేటను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యంలో అధికారుల అలసత్వమో.. లబ్ధిదారుల్లో నిరుత్సాహమో ఏదీ తెలియడంలేదని మిగతా గ్రామాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

## మిగతా ఇండ్ల పనులు ప్రారంభిస్తాం



దమ్మన్నపేటను పైలట్ గ్రామంగా ఎంపిక చేశాం. 145మంది లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు పత్రాలు అందించాం. వంద శాతం ఇండ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యేలా లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలు పాటిస్తున్నాం. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి స్థాయిలో ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటాం.

*- అనుమల రాజేందర్, ఎంపీడీవో (గంభీరావుపేట)*

# కాంగ్రెస్‌లో భగ్గుమన్న విభేదాలు

- ఓడిపోతున్నోళ్లకే టిక్కెట్లు ఇస్తున్నారంటూ సిరిసిల్లలో నిలదీసిన పీసీసీ అధికార ప్రతినిధి ఉమేశ్‌రావు
- ఏఐసీసీ కార్యదర్శి ముందే రెచ్చిపోయిన కేకే వర్గీయులు
- రసాభాసగా పార్టీ విస్తృత స్థాయి సమావేశం



కాంగ్రెస్ పార్టీ జిల్లా విస్తృత స్థాయి కమిటీ సమావేశంలో గొడవపడుతున్న నాయకులు



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ)/ సిరిసిల్ల టౌన్: సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీలో విభేదాలు భగ్గుమన్నాయి. మంగళవారం జిల్లా కేంద్రంలోని లహరి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి సమావేశం రసాభాసగా మారింది. ఓడిపోయినోళ్లకే టిక్కెట్లు ఇస్తున్నారంటూ పీసీసీ అధికార ప్రతినిధి చీటి ఉమేశ్‌రావు అన్న వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వేదికపై నుంచి దిగిపోవాలంటూ ఓ వర్గానికి చెందిన కార్యకర్తలు పట్టుబట్టారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథ్ ముందే కార్యకర్తలు నానా హంగామా సృష్టించడంతో గందరగోళంగా మారింది. జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్ నుంచి లహరి ఫంక్షన్‌హాల్ వరకు కాంగ్రెస్ పార్టీ పాదయాత్ర నిర్వహించి, ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమేశ్‌రావు మాట్లాడుతూ 20 ఏళ్లుగా పార్టీని పట్టుకుని పనిచేస్తున్న కార్యకర్తలకు టిక్కెట్లు ఇవ్వడం లేదని, సర్పంచు నుంచి మొదలు ఎమ్మెల్యే వరకు ఒక్కస్థానం కూడా కాంగ్రెస్ సిరిసిల్లలో గెలువ లేకపోయిందని పేర్కొన్నారు. మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీపీ సీట్లు ఎందుకు గెలువ లేక పోతున్నామో ఆలోచించాలన్నారు. 25 ఏళ్లుగా జెండా మోసిన కార్యకర్తలకు న్యాయం జరగలేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి కొడుకు అయిదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా బలమైన నాయకుడిగా ఎదిగారని, ఆ స్థాయి నాయకుడిని ఎదిరించే ప్రణాళికలు మనవద్ద ఉన్నాయా? అంటూ ప్రశ్నించారు. ఓడిపోతున్న వారికే టిక్కెట్లు ఇస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు. ఆయన మాటలకు కేకే మహేందర్‌రెడ్డి అనుచరులు అడ్డుపడ్డారు. వేదికపైకి దూసుకు పోతూ మాట్లాడవద్దంటూ గొడవ చేశారు. కార్యకర్తలు చేసిన హంగామాతో సమావేశం రసాభాసగా మారింది. పోలీసులు కలుగజేసుకుని కార్యకర్తల్ని నిలువరించారు. సంయమనం పాటించాలంటూ విప్ ఆది శ్రీనివాస్, కేకే మహేందర్‌రెడ్డి కార్యకర్తలను వారించడంతో శాంతించారు. ఏఐసీసీ కార్యదర్శి ముందే వర్గపోరు బహిర్గతమై కార్యకర్తలు కుమ్ములాడుకోవడం చర్చనీయాంశంగా మారింది.

## బెటాలియన్ ఏఎస్‌ఐకి దేహశుద్ధి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 29: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సర్దాపూర్‌లోని 17వ పోలీస్ బెటాలియన్‌లో ఏఎస్‌ఐగా పని చేసే మహేశ్ చోరీకి యత్నించాడని సోమవారం రాత్రి స్థానికులు దేహశుద్ధి చేశారు. మహేశ్ సర్దాపూర్‌లో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. కొంతకాలంగా అతడు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నట్టు తెలిసింది. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి ఓ ఇంట్లో దూరగా, చోరీకి యత్నించాడని కుటుంబసభ్యులు, స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించి ఏఎస్‌ఐ మహేశ్‌ను వారికి అప్పగించగా, అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నామని, బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు సిరిసిల్ల పట్టణ సీఐ కృష్ణ తెలిపారు.

## ఉత్సవ కమిటీ ఎన్నిక

ముస్తాబాద్, ఏప్రిల్ 29: బంధనకల్‌లో సీతారాముల ఆలయంలో ఉత్సవాల కోసం మంగళవారం ఉత్సవ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాయం రాజు, ఉపాధ్యక్షులుగా పాతూరి నారాయణరెడ్డి, బుచ్చెల్లి మహేశ్వరి, వేముల రాములు, ప్రధాన కార్యదర్శిగా మొగిలిపువ్వు సత్యనారాయణ, కోశాధికారిగా సురభి శ్రీదర్‌రావు, సలహాదారులను ఎన్నుకునట్లు సభ్యులు తెలిపారు.

# ధాన్యం తరలింపునకు ప్రత్యేక చర్యలు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- ధాన్యం కొనుగోలు, తరలింపుపై కలెక్టర్, అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, పక్కన విప్

కలెక్టరేట్, ఏప్రిల్ 29: కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరించిన ధాన్యం తరలింపునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. ధాన్యం సేకరణ, తరలింపుపై ఆయాశాఖల అధికారులతో సమీకృత కలెక్టరేట్‌లో మంగళవారం సమావేశం నిర్వహించగా, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి విప్ సమీక్షకు హాజరయ్యారు. ముందుగా మండలాల వారీగా ఉత్పత్తి అయిన ధాన్యం వివరాలు, ఇప్పటి వరకు మిల్లులకు తరలించిన ధాన్యం వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ, ధాన్యం తరలింపునకు ఒప్పందం చేసుకున్న లారీల కాంట్రాక్టర్ జిల్లాలోని ఐదు రూట్లలో దాదాపు 500 లారీలు సమకూర్చాల్సి ఉందని తెలిపారు. సదరు కాంట్రాక్టర్ 180 లారీల వరకు సమకూర్చడంతో దాన్యం తరలింపులో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వెల్లడించారు. ఇప్పటికిప్పుడు ధాన్యం తరలింపునకు ప్రత్యామ్నాయంగా జిల్లాలోని వంద లారీలను అలాగే రైస్ మిల్లర్ల పరిధిలోని 50 లారీలను సిద్ధంగా ఉంచామని తెలిపారు. రుద్రంగి పరిధిలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని అలాట్ చేసిన రైస్ మిల్లులకు తరలిస్తూనే స్థానిక ఏఎంసీ గోడౌన్‌లో నిల్వ చేయాలని ఆదేశించారు. రైస్‌మిల్లర్లు బ్యాంక్ గ్యారంటీ ఇచ్చేందుకు ముందుకురాకపోతే అప్పారెల్ పార్కులోని గోదాములు, ఏఎంసీ గోదాముల్లో ధాన్యం నిల్వచేసేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారని వెల్లడించారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోని సన్నరకం వడ్లు విక్రయించి మద్దతు ధరతోపాటు బోనస్ పొందాలని సూచించారు. సమావేశంలో డీఆర్డీవో శేషాద్రి, డీసీఎస్‌వో వసంతలక్ష్మి, డీఎం రజిత, డీఏఈవో అఫ్జల్‌బేగం, డీసీవో రామకృష్ణ, డీటీవో లక్ష్మణ్ పాల్గొన్నారు.

## రైతును రాజు చేయడమే లక్ష్యం

కోనరావుపేట, ఏప్రిల్ 29: రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ పేర్కొన్నారు. నిజామాబాద్ రైతు వేదికలో భూ భారతిపై అవగాహన సదస్సు నిర్వహించగా, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి హాజరై, మాట్లాడారు. భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించేందుకు గానూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం నిజామాబాద్‌లో కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఇక్కడ తహసీల్దార్ వరలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ ఎల్లయ్య, తదితరులు ఉన్నారు.

# శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా యువజన క్రీడల అధికారి అజ్మీరా రాందాస్

కలెక్టరేట్, ఏప్రిల్ 29: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఉచిత వేసవి క్రీడాశిక్షణ శిబిరాలను యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువజన క్రీడల అధికారి అజ్మీరా రాందాస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ మినీస్టేడియం సిరిసిల్లలో మే 1 నుంచి జూన్ 6 వరకు 12రకాల క్రీడాంశాల్లో ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. అథ్లెటిక్స్, కరాటే, యోగా, వాలీబాల్, టేబుల్ టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్, బాస్కెట్‌బాల్, ఆర్చరీ, కబడ్డీ, క్యారమ్, చెస్ పోటీలు ఉంటాయన్నారు. ప్రతిరోజూ ఉదయం 6నుంచి 9గంటల వరకు, సాయంత్రం 4నుంచి 7గంటల వరకు సదరు క్రీడల్లో ఉచితంగా శిక్షణ ఇస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న 14ఏండ్లలోపు బాలబాలికలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★Anjamma Boddu D/o Narsaiah (Old name), H.No. 11-6-92, Sundaraiahnagar, town&mandal Sircilla, Rajanna Sircilla. My name is going to be changed as Anjali Boddu W/o Bandameedi Narsimlu (New Name) NTK-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధమూ లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం:

GST 5% వర్తించును

Cell: 9182 777 571

9182 777 189

# ప్రకటనలు చూసి మోసపోవద్దు

- ఎస్పీ మహేశ్ గితె
- సైబర్ నేరాల ఛేదనపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు



శిక్షణ తరగతులలో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్ గితె

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): ఆన్‌లైన్ ప్రకటనలకు ఆకర్షితులై పెట్టుబడులు పెట్టి.. మోసపోవద్దని ఎస్పీ మహేశ్‌గితె సూచించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో పిల్లల ఆన్‌లైన్ భద్రతపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, సిద్దిపేట జిల్లాల పోలీస్ అధికారులు, సిబ్బందికి సైబర్ నేరాలను నియంత్రించేందుకు నిపుణులతో మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహిచారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సైబర్ నేరాల చేధనకు ప్రత్యేక సైబర్ శిక్షణ కార్యక్రమాలు ఎంతో దోహదపడుతాయన్నారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానంపై ఇస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. డీజీపీ జితేందర్ ఆదేశాల మేరకు సైబర్ నేరాల పరిశోధనలో ఉపయోగించాల్సిన అంశాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురయితే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. సోషల్‌మీడియాలో వ్యక్తిగత సమాచారం షేర్ చేయడంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ రాజ్‌కుమార్, కృష్ణానాయక్, అఖిలేష్‌రావు, వివిధ జిల్లాల పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాధితులకు భరోసా కల్పించాలి

వీర్నపల్లి, ఏప్రిల్29: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారితో గౌరవంగా వ్యవరించాలని, ఫిర్యాదులపై తక్షణపై స్పందించి బాధితులకు భరోసా కల్పించాలని ఎస్పీ మహేశ్ బీ గితె పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించి, కేసుల వివరాలు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదుపై పారదర్శక విచారణ చేపట్టాలన్నారు. డయల్ 100 ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. చోరీల నివారణకు రాత్రి సమయాల్లో గస్తీ ముమ్మరం చేయాలన్నారు. లోన్ యాప్, సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అటవీశాఖ కార్యాలయ భవనాల్లో పోలీస్‌స్టేషన్ నిర్వహించడంపై ఆరా తీశారు. ఆయన వెంట సీఐ శ్రీనివాస్ గౌడ్, ఎస్ఐ ఎల్లాగౌడ్, తదితరులు ఉన్నారు.

## 'మత్తు' ప్రమాదాన్ని వివరించాలి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 29: మత్తు పదార్థాల వినియోగంతో కలిగే ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ మహేశ్ బీ గితె పోలీస్ సిబ్బందికి సూచించారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, మాట్లాడారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు భరోసాను కల్పించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల వివరాలు, నమోద అవుతున్న కేసులపై అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ డీఎస్పీ కే చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ రమాకాంత్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

## సర్వే సకాలంలో పూర్తి చేయాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

కలెక్టరేట్, ఏప్రిల్29: రాజన్న ఆలయ రోడ్డు విస్తరణ భూసేకరణ కోసం సకాలంలో సర్వే పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆలయ రోడ్డు విస్తరణ, భూసేకరణ పనులపై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మాట్లాడుతూ, వేములవాడ ఆలయం వద్ద రోడ్డు విస్తరణ పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, వీటికి అవసరమైన భూసేకరణ చేసేందుకు తొలగించాల్సిన నిర్మాణాల ప్రతిపాదనలను నాలుగు టీమ్‌ల ద్వారా సర్వే చేసి అందించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. భూసేకరణ చట్టం 2013 సెక్షన్ 12ప్రకారం భూసేకరణ నిమిత్తం సర్వే చేసే పూర్తి అధికారాలు ఉన్నాయన్నారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాధాబాయి, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ఈఈ ఆర్‌అండ్‌బీ రమణయ్య, ఈఈ మిషన్ భగీరథ జానకి, ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు పని కల్పించాలి

కోనరావుపేట, ఏప్రిల్ 29: ఉపాధిహామీ పథకంలో కూలీలకు పని కల్పించాలని ఎంపీడీవో శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన నాగారంలో ఉపాధిహామీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కూలీలకు సూచించారు. ఇక్కడ టీఏ రాజు, ఎఫ్ఏ బుర్రవేణి పద్మ, తదితరులు ఉన్నారు.

## 'భేటీ బచావో.. భేటీ పడావో'పై అవగాహన

బోయినపల్లి రూరల్, ఏప్రిల్ 29: కొదురుపాక సెక్టార్ పరిధిలో మంగళవారం భేటీ బచావో.. భేటీ పడావో కార్యక్రమంపై జిల్లా సంక్షేమశాఖ అధికారి లక్ష్మీరాజం అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్‌లకు ప్రీస్కూల్ నమోదు పెంచుకోవాలని, వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అంగన్‌వాడీ టీచర్‌లకు వివరించారు. ఇక్కడ జిల్లా డీహెచ్‌వోబీ కోఆర్డినేటర్ రోజా, సీడీపీవో సౌందర్య, ఐసీడీఎస్ అధికారి రాజ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

## ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

ముస్తాబాద్, ఏప్రిల్ 29: బంధనకల్ గ్రామంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు ఆయిల్‌పామ్ ఏరియా మేనేజర్ ప్రేమ్‌సాయిరెడ్డి అవగాహన కల్పించారు. ఆయిల్‌పామ్ గేలల సేకరణ, సాగులో మెలకువలు, వేసవి కాలంలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, నీటి యాజమాన్యం గురించి వివరించారు. ఇక్కడ హార్టికల్చర్ ఆఫీసర్ గోవర్ధన్, ఏఈవో రేవతి, క్లస్టర్ ఆఫీసర్ హరీశ్, తదితరులు ఉన్నారు.

## కొనసాగుతున్న ఇంటర్వ్యూలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 29: రాజీవ్ యువవికాసం యూనిట్ల కోసం అర్జీదారులకు ఇంటర్వ్యూలు కొనసాగుతున్నాయి. మండల కేంద్రానికి చెందిన 700మంది అర్జీ పెట్టుకోగా, మంగళవారం ఎంపీవో జోగం రాజు ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు కొనసాగాయి. ఉదయం నుంచే మండల పరిషత్ కార్యాలయం వద్ద అర్జీదారులు బారులు తీరారు.



వేములవాడ: కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న క్రైస్తవులు



తెలంగాణ చౌక్: కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

## పహల్‌గామ్ బాధితులకు ఘన నివాళి

వేములవాడ, ఏప్రిల్ 29: పహల్‌గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేస్తూ వేములవాడ క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఉగ్రదాడి చేసిన వారిని కఠినంగా శిక్షించి, బాధిత కుటుంబాలకు భరోసా కల్పించాలని కోరారు. ఇక్కడ క్రిస్టియన్ అసోసియేషన్ మండలాధ్యక్షుడు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఏసుపాల్, సీహెచ్ రాజు, మోజస్, జాన్, తిమోతి, జఫన్యా అరోన్, గుండా థామస్, తదితరులు ఉన్నారు.

తెలంగాణ చౌక్, ఏప్రిల్ 29: పహల్‌గామ్‌లో ఉగ్రదాడిని నిరసిస్తూ సిరిసిల్ల పట్టణంలోని గాంధీచౌక్ నుంచి అంబేద్కర్‌చౌక్ వరకు పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ తీశారు. ఇక్కడ నేతలు మోతీలాల్, గంగరాజు తదితరులు ఉన్నారు.

ఇల్లంతకుంట, ఏప్రిల్ 29:ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారి ఆత్మకు శాంతిచేకూరాలని కోరుతూ మండల కేంద్రంలోని గంగాధర క్షేత్రంలో పూజారి మూగు నాగరాజుశర్మ, ఆనంద్‌శర్మ ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు.



ఇల్లంతకుంట: కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న పూజారి, భక్తులు

## 'గురుకులం' విద్యార్థులకు అభినందనలు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 29: ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల సెకండియర్ విద్యార్థిని బీ నందిని (ఎంపీసీ- 995) అత్యుత్తమ ఫలితాలతో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా నందినిని మంగళవారం డీఐఈవో వై శ్రీనివాస్ అభినందించారు. ఇక్కడ గురుకుల కోఆర్డినేటర్ థెరిస్సా, బద్దెనపల్లి ప్రిన్సిపల్ పద్మ, వైస్ ప్రిన్సిపల్ రమ్యకృష్ణ, తదితరులు ఉన్నారు.

## లబ్ధిదారులను ఎంపిక చేయాలి

ముస్తాబాద్, ఏప్రిల్ 29: ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అవకతవకలు జరుగుతున్నందున గ్రామాల్లో సభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని బీఆర్ఎస్ నాయకుడు బైతి నవీన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. ఇందిరమ్మ కమిటీ పేరుతో అవకతవకలు పాల్పడుతూ, అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు వచ్చే అవకాశం లేకుండా కొందరు చేస్తున్నారని మండిపడ్డారు. కాసులకు అలవాటు పడి, ఇష్టానుసారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారని ఆరోపించారు.

## బద్ది పోచమ్మ ఆలయం వద్ద భక్తుడి వీరంగం

వేములవాడ, ఏప్రిల్ 29: బద్ది పోచమ్మ ఆలయం వద్ద ఓ భక్తుడు వీరంగం సృష్టించడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం బద్ది పోచమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ అధికంగా ఉన్నది. దీంతో సదరు భక్తుడు క్యూలైన్ దూకి ఆలయంలోకి ప్రవేశించాడు. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న ఎస్పీఎఫ్ పోలీస్ కానిస్టేబుల్ నరేందర్ సదరు భక్తుడిని బయటకు పంపించాడు. దీంతో సదరు భక్తుడు పోలీసు సిబ్బంది, ఆలయ అధికారులపై దాడికి ప్రయత్నించాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడి చేరుకొని ఇద్దరు భక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

## రాజన్న గోశాలకు గడ్డి వితరణ



గోశాలకు గడ్డి వితరణ చేసి రశీదును తీసుకుంటున్న రమేశ్‌రెడ్డి

కోనరావుపేట, ఏప్రిల్ 29: వేములవాడ రాజన్న గోశాలకు మండల కేంద్రానికి చెందిన సింగిల్‌విండో డైరెక్టర్ కరెడ్ల రమేశ్‌రెడ్డి పశు గ్రాసం వితరణ చేశాడు. సుమారు రూ.6వేల ఖర్చుతో తన పంట పొలంలోని గడ్డిని కట్టలుగా కట్టించి, తానే స్వయంగా ట్రాక్టర్ ద్వారా గోశాలకు తరలించారు. రమేశ్‌రెడ్డిని అధికారులు అభినందించారు.

## యువకుడి బలవన్మరణం

చందుర్తి, ఏప్రిల్29: కిష్టంపేటకు చెందిన కొమ్ము నర్సయ్య (38) ఆర్థిక ఇబ్బందులతో నెల క్రితం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడగా, మంగళవారం దవాఖానలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఇంటికి పెద్దదిక్కు ఆత్మహత్యకు పాల్పడడంతో ఆ చిన్నారుల విలపించిన తీరు పలువురినీ కలిసివేసింది. నర్సయ్యకు భార్య పద్మ, కూతుళ్లు రుచిత, జయ కుమారుడు నిరంజన్ ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు

## వేసవిలోనూ అంగన్‌వాడీ సేవలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 29: వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకుని చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు ప్రీస్కూల్ సేవలు అందిస్తామని జిల్లా సంక్షేమాధికారి పోచంపల్లి లక్ష్మీరాజం పేర్కొన్నారు. మంగళవారం దుమాలలో జరిగిన సెక్టార్ సమావేశానికి హాజరై మాట్లాడారు. వేసవి సెలవుల దృష్ట్యా సేవలు అందించేందుకు 15రోజులపాటు టీచర్, 15రోజుల పాటు ఆయా సేవలు అందిస్తారని చెప్పారు. వేసవిలో చిన్నారులు, మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇక్కడ సూపర్‌వైజర్ గుమ్మడి కళావతి, టీచర్లు ఉన్నారు.

## నత్తనడకన కొనుగోలు కేంద్రాలు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 29: ధాన్యం కొనుగోలు కేంద్రాలు నత్తనడకన సాగడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహా రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేంద్రాల నుంచి ఇప్పటి వరకు ఒక్క గింజ వడ్లు మిల్లులకు తరలించలేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని చూసి రైతులు ఆవేదనకు గురవుతున్నారన్నారు. ఇప్పటి వరకు మిల్లర్ల అలాట్‌మెంట్ చేయలేదని మండిపడ్డారు. ఎప్పుడు వర్షం పడుతుందోనని రైతులు భయాందోళనతో బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారని ఆరోపించారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న గోపాల్‌రావు, నాయకులు

ముస్తాబాద్, ఏప్రిల్ 29: ఆవునూరుకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేతలు చేపూరి శ్రీనివాస్‌గౌడ్, రమేశ్‌గౌడ్ మాతృమూర్తి సోమవారం మృతిచెందింది. మంగళవారం బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ సీనియర్ నేత కల్వకుంట్ల గోపాల్‌రావు, మండలాధ్యక్షుడు సురేందర్‌రావు, సెస్ మాజీ డైరెక్టర్ కొమ్ము బాలయ్య, మండల కోఆప్షన్ మాజీ మెంబర్ అన్వర్, ఆవునూరు గ్రామశాఖ అధ్యక్షుడు పొన్నాల పద్మారెడ్డి, కుంబాల మల్లారెడ్డి పరామర్శించారు.

## మే డేను విజయవంతం చేయాలి

రుద్రంగి, ఏప్రిల్29: మండల కేంద్రంలో నిర్వహించే మే డే కార్యక్రమంలో కార్మికులు, కూలీలు పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యురాలు విమలక్క కోరారు. మంగళవారం మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి మే డే కార్మిక దినోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు.

## కరపత్రాల ఆవిష్కరణ

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 29: తంగళ్లపల్లి మండలం నేరెళ్లలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు ఆధ్వర్యంలో మంగళవారం మే డే వేడుకల కరపత్రాలను ఆవిష్కరించారు. ఇక్కడ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, హమాలీ సంఘం అధ్యక్షుడు చిన్న కుంటయ్య, పాండు, శ్రీను, నారాయణ, పందరి, పోచయ్య, శ్రీను, విజయ్, కొల రాజయ్య, మీసాల నర్సయ్య, ఎల్లయ్య, విజయ్, దాసరి శ్రీను, కనకయ్య, మిరుపాల కనకయ్య ఉన్నారు.

## కారు, ప్యాసింజర్ ఆటో ఢీ

కోనరావుపేట, ఏప్రిల్ 29: మామిడిపల్లి-నిజామాబాద్ గ్రామాల మధ్యలో ప్యాసింజర్ ఆటోను సిద్దిపేటకు చెందిన మదాంశెట్టి శివ కారుతో బలంగా ఢీకొట్టాడు. దీంతో ఆటోలోని కుంట పద్మ, గాండ్ల జ్యోతి, జిల్లాల అమృత, దేవక్కకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని అంబులెన్స్‌లో సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించారు. పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

## దుమాలకు ఆర్టీసీ బస్సు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 29: దుమాలకు కొంతకాలంగా నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు మంగళవారం ప్రారంభమైంది. బస్సును పునరుద్ధరించినందుకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.